కర్నూలు I నంద్యాల

వార్త

13 జూన్, 2024 గురువారం పేజీలు 4


# ప్రమాణ స్వీకారోత్సవ ప్రత్యక్ష ప్రసారం

**: జిల్లా కలెక్టర్,అధికారులు,ప్రజలు హాజరు**



**కర్నూలు, జూన్ 12, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు, మంత్రివర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ వేడుకను కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా జిల్లా కలెక్టర్ డా. జి.సృజన వీక్షించారు. బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు, ఇతర మంత్రి వర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం గన్నవరం వద్ద కేసరిపల్లిలో అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల పరిధిలో ఏడు చోట్ల జిల్లా యంత్రాంగం ప్రత్యక్ష ప్రసార ఏర్పాట్లు చేసింది. జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన, జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ మధుసూదన్ రావు, ఇతర జిల్లా అధికారులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా ముఖ్య మంత్రి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వివిధ కార్యాలయాల సిబ్బంది, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# చదువుకు.. వేళాయెరా..!



- నేటి నుంచి మోగనున్న 'బడిగంటలు'..
- ఆటలకు టాటా..ఇక బడి బాట..
- అక్షర యజ్ఞానికి అక్షరోద్యమ బాట..
- నేటి నుంచి పాఠశాలల పున: ప్రారంభం..

**"నేటి నుంచి పాఠశాలలు తెరుచుకోనున్నాయి.. రెండు నెలల వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలలు పున:ప్రారంభం కానున్నాయి..చదువుకు వేళాయెరా అంటూ పిల్లలు పరుగులు తీస్తున్నారు..విద్యా క్యాలండర్ ప్రకారంజూన్ 12వ తేదినే పాఠశాలలు ప్రారంభం కావాల్సి ఉంది.. కానీ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి నూతన ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయిడు ప్రమాణా స్వీకారం చేస్తుండడంతో పాఠశాలలకు ఇబ్బందికరంగా ఉంటుందని 13వతేదిన పాఠశాలలను తెరుస్తున్నారు.. దీంతో బడి గంటలు ఒకరోజు ఆలస్యంగా గురువారం నుండి మోగనున్నాయి.ఇన్ని రోజులు ఆడిన ఆటలకు టాటా చెబుతూ ఇక బడిబాట పట్టేందుకు పిల్లలు వారి తల్లిదండ్రులు సిద్ధమయ్యారు..విద్యారంగానికి గత ప్రభుత్వం ఎక్కువ శాతం ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల శాతం గణనీయంగాపెంచేందుకు కృషి చేసింది..ఈ క్రమంలోనే ఒత్తిడిలేని విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని సిలబస్‌ను తయారు చేసింది.. కాగా ప్రస్తుతం రాష్ట్రంలో జరిగిన ప్రభుత్వ మార్పులకు అనుగుణంగా విద్యా వ్యవస్థలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి"..**

**కోసిగి, జూన్ 12, ప్రభాతవార్త :** వీపుకు పుస్తకాల సంచి..ఒక చేత్తో లంచ్ బ్యాగ్.. మరోచేత్తో అమ్మచేయి పట్టుకుని బుడిబుడి అడుగులతో పాఠశాలకువెళ్లే రోజు రానే వచ్చింది.. నిన్నటి వరకు ఉదయాన్నే ఆటపాటలకు పరుగులు తీసిన పిల్లలు నేటి నుంచి పాఠశాల బాట పట్టనున్నారు.. బస్సులు, ఆటోలు పట్టుకునేందుకు పరుగులు పెట్టనున్నారు.. దాదాపుగా 50 రోజుల పాటు సరదాగా గడిపిన చిన్నారులు నేటి నుంచి బడిబాట పట్టేందుకు సిద్ధమయ్యారు.. వేసవి సెలవుల అనంతరం నేడుపాఠశాలలు పున:ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పటి వరకు ఉల్లాసంగా గడిపిన విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలంటే కొంచెం అయిష్టత ప్రదర్శిస్తుంటే, స్కూల్ ఫీజులు తదితర వాటిని సమకూర్చలేక కొండంత ఖర్చును ఊహించు కుని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.. జిల్లాలో 4485 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు న్నాయి..వీటిలో 3024 ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 4,08,264 మంది విద్యార్థులు విద్యనభ్య సిస్తున్నారు..వీరందరికి మధ్యాహ్న భోజనం పథకం అమలు చేస్తున్నారు..ఇదిలా ఉంటే పాఠశాలల్లో అమలు చేస్తున్న భోజనంపై పర్యవేక్షణ కొరవడు తోంది. కొన్ని చోట్ల ఉపాధ్యాయుల కొరతఉంది..ఈ ఏడాది ప్రభుత్వం మారినప్పటికీ అన్ని ప్రభుత్వం పాఠశాలల్లో నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలతో పాటుపాఠశాల యూనిఫామ్, బ్యాగులు, షూస్, సాక్సులు తదితర విద్యా కానుకలను పూర్తి స్థాయిలో నేటి నుండి...

• వివరాలు 2లో

# "మంత్రి టీజీ భరత్" అభిమానుల సందడి..!

- జిల్లా వ్యాప్తంగా మిన్నంటిన సంబరాలు
- పార్టీ కార్యకర్తల్లో ఎనలేని ఆనందం
- స్నేహితులు, సన్నిహితుల, నాయకుల అభినందనలు



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి టీజీ భరత్ అభిమానుల సంబరాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఆయనకు మంత్రి పదవి రావడం పై సందడి నెలకొంది. కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులు టీజీ భరత్ కు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర మంత్రివర్గంలో అవకాశం ఇవ్వడం పట్ల జిల్లా ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పారిశ్రామిక రంగానికి చెందిన కుటుంబం కావడంతో జిల్లాలోని పలు ప్రాంతాలతో భరత్‌కు సంబంధాలు ఉన్నాయి. ఆదోని ప్రాంతంలో బంధుగణం ఉంది. అదేవిధంగా ఇతర నియోజకవర్గాల్లోనూ ఆయనకు అభిమానులు, స్నేహితులు ఉన్నారు. అన్నింటిని మించి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు టీజీ భరత్ పట్ల ప్రత్యేక అభిమానం ఉంది. ఈ నేపథ్యంలో భరత్ కు మంత్రి పదవి రావడంపై జిల్లాలో సర్వత్ర సంతోషం నెలకొంది. భరత్ కు మంత్రి పదవి రావడం ఆయన గౌరవానికి మరింత వన్నెతెస్తుందని అభిమానులు చెబుతున్నారు. మంత్రిగా కాకముందు.. ఎమ్మెల్యేగా గెలవక ముందు కూడా వ్యక్తిగతంగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టిన భరత్ మంత్రిగా అధికారం రావడంతో మరింతగా ప్రజాసేవలో ముందుకు వెళ్తారని అంటున్నారు. టీజీ భరత్ యూత్ ద్వారా ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలు చేపట్టాడు. అన్నింటిని మించి ఉద్యోగాల కల్పనలో సైతం భరత్ ప్రత్యేకంగా పనిచేశారు.

**కర్నూలు, జూన్ 12, ప్రభాతవార్త :** కర్నూలు జిల్లాకు చెందిన టీజీ.భరత్ 1977 ఆగస్టు 5న విజయ వాడలో టీ.జీ. వెంకటేష్, టీజీ స్వరాజ్య లక్ష్మి కుమారి దంపతులకు జన్మించాడు. ఆయన 1999లో యూకేలోని కార్డిఫ్ యూనివర్సిటీ నుండి ఎంబీఏను పూర్తి చేశాడు. ఫిబ్రవరి 9, 2001న శిల్పని వివా హం చేసుకున్నాడు. ఈ దంపతులకు ఒక కుమార్తె విబు, ఓ కుమారుడు శ్రీ ఆర్య ఉన్నారు. టీ. జీ. భరత్ తన తండ్రి మాజీ మంత్రి టీజీ వెంకటేశ్ అడుగుజాడల్లో తెలుగు దేశం పార్టీ ద్వారా రాజకీయాల్లో వచ్చి 2019 లో కర్నూలు నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి తన సమీప ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థి అబ్దుల్ హాఫీజ్ ఖాన్ చేతిలో 5,353 ఓట్ల తేడాతో ఓడిపోయాడు. ఆ తరువాత కర్నూలు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్‌గా ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ 2024లో జరిగిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికలలో కర్నూలు నుండి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి తన సమీప వైసీపీ అభ్యర్థి ఎం.డీ. ఇంతియాజ్ అహ్మద్‌పై 18,876 ఓట్ల మెజారిటీతో గెలిచి తొలిసారి ఎమ్మెల్యేగా అసెంబ్లీకి ఎన్నికయ్యాడు. వైశ్య సామాజిక వర్గంకు చెందిన ఆయన తాజా మంత్రి వర్గంలో ప్రమాణ స్వీకారం చేశారు. టీజీ భరత్ రాజకీయ నాయకుడిగానే కాక నిస్వార్ధ ప్రజాసేవకుడిగా ప్రజలకు సుపరి చితుడు. గత ఐదేళ్ల అధికారం లేకపోయినా ప్రజల్లోనే ఉన్నారు. ప్రజాసేవలోనే ఉంటూ ప్రజలకు కావలసిన సహాయం అందించారు. సాధారణంగా ఎన్నికలలో ఓడిపోయిన అభ్య ర్థులు మళ్లీ ఎన్నికలు వచ్చేవరకు ప్రజలతో నామమాత్రంగానే టచ్‌లో ఉంటారు. కానీ భరత్ మాత్రం ఐదేళ్ల పూర్తిస్థాయిలో ప్రజలతోనే ఉన్నారు. టీజీ భరత్ హామీలు ఇవ్వడమే కాకుండా ఎప్పుడు లేనివిధంగా జాబ్ మేల స్వంత నిధులతో ఎర్పాటు చేసి 400 మందికి...

2లో

# 34 మంది అప్కాస్ ఉద్యోగుల.. పరిస్థితి అగమ్యగోచరం

- లక్షలు చెల్లించిచేరాం తొలగిస్తారని అందోళన
- లాభపడ్డ ఇద్దరు పిఎలు, ఒక అటెండరు, కంప్యూటర్ అపరేటర్
- ఉద్యోగాలు తొలగిస్తే డబ్బులు తీసుకున్నవారి ఇంటివద్ద ధర్నా
- ఐదేళ్ళలో మున్సిపాలిటిలో చేరిన వారి వివరాలు గోప్యం
- మున్సిపాలిటిలో కీలకంగా మారిన కంప్యూటర్ అపరేటర్లు
- ఒక నెల జీతం తీసుకున్న 34 మంది

**నంద్యాల మున్సిపాలిటిలో వివరాలు గోప్యం. మీడియా, కౌన్సిలర్లు అడిగిన వివరాలు గోప్యంలో ఉంచడంలో మర్మం దేవుడికే తెలియాలి. ఐదు సంవత్సరాల్లో దాదాపు 100 మందిని తీసుకున్నట్లు సమాచారం. కెఎస్‌కె న్యూస్ చెప్పిన విధంగా రోజువారిలో 34 మంది రెండు నెలల క్రితం చేరిన వారి పేర్లు, సెల్ నంబర్లు మీరే గమనించండి ఇలా దాదాపు 100 మంది చేరిన వారు ఎక్కడ పనిచేస్తున్నారు వారి వివరాలు అడిగితే అంతా గోప్యం. రెండు నెలల క్రితం లక్షలు ఇచ్చిన చేరినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొదటి జీతం తీసుకున్నవారు రెండవ జీతం తీసుకోవడానికి సిద్దంగా ఉన్నా ప్రభుత్వం మారడంతో మా ఉద్యోగాలు ఉంటయో ఊడిపోతాయో అంటూ అవేదన వ్యక్తం చేస్తున్నారు.**

**నంద్యాల, జూన్ 12, ప్రభాతవార్త ప్రతినిధిః** బహిరంగంగా చెప్పడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఒకానొక సమయంలో మాత్రం మా ఉద్యోగాలు పోతే డబ్బులు తీసుకున్నవారి ఇంటి ముందు ధర్నాలు చేస్తామని చెప్పుకోస్తు న్నారు. వివరాల్లోకి వెళ్లితో 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మున్సి పాలిటిలో సిబ్బంది తక్కువగా ఉండడంతో అంచలంచలుగా చిరుద్యోగాల్లో దాదాపు 100 మంది చేరారు. నాణ్యానికి ఒకవైపు మాత్రమే ఇది. రెండవ వైపు వారి ఉద్యోగాలు రావడానికి కార్యాల యంలో పనిచేస్తున్న ఇద్దరు పిఏలు, ఒక అటెండరు, ఒక కంప్యూటర్ అపరేటర్ ఒక ద్వితీయస్థాయి నాయకుడు ప్రధాన పాత్ర పోషిచినట్లు తెలుస్తోంది. ఇద్దరు పిఏలు వారి అప్లికేషన్లు పూర్తిచేసే పనివారిది. అటెండరు పాత్ర వారి వద్ద డబ్బులు వసూలు చేయడం, కంప్యూటర్ అపరేటర్ పాత్ర అప్కాస్‌లో పేర్లు నమోదు చేయడం ఆయన పని. ద్వితీయ స్థాయి నాయకుడు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ఆయన పాత్ర ఇలా అన్నిపాత్రలు రక్తికట్టించి ఒక్కొక్కరి వద్ద దాదాపు రూ.3 లక్షలు ఏవరి వాటా వారు తీసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరో వైపు రూ.3 లక్షలే కాకుండా అప్కాస్‌లో పేరు నమోదుచే యడానికి ఆయనకు సపరేట్ రేట్ ఫిక్స్ చేసినట్లు సమాచారం. గుట్టుగా సాగిన వ్యవహారం అంతా తెలుగు దేశం పార్టీ నాయకులకు తెలిసిపోవడంతో పూర్తిసమాచారం తెలుసుకోవడానికి ఒకసీనియర్ నాయకుడికి అప్పగించినట్లు తెలుస్తోంది. ఆ నాయకుడు పూర్తి సమాచారం సేకరిస్తుండడంతో అందరికి వనుకు మొదలయింది. ప్రమాణస్వీకారం అనంతరం మున్సిపాలిటిపై దృష్టిపెట్టనున్నట్లు తెలుస్తోంది. మున్సిపాలిటిలో దాదాపు 30 మంది సీనియర్లు ఉన్నా వినయ విధేయత కలిగిన 14 మందికి మాత్రమే జీతాలు పెంచడం పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆరోపణలు ఉన్న అందరిపై చర్యలు తప్పవని తెలుస్తోంది. కెఎస్‌కె న్యూస్ మొదటి లిస్టు మీ ముందుకు తీసుకువచ్చింది. మిగతావారి వివరాలు త్వరలో మీ ముందుకు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తుంది. అప్పులు చేసి లక్షలు ఇచ్చిన ఉద్యోగాల్లో చేరినవారి పరిస్థితి తలుచుకుంటే కష్టపడి పనిచేసిన అధికారులకు మాత్రం చేతికి చిప్ప. మధ్య దళారులుగా పనిచేసినవారికి లక్షల్లో ఆదాయం. అదృష్టమంటే ఇదేనేమో. నేతలు, అధికారులు సీరియస్‌గా తీసుకుంటే అసలు విషయాలు బయటపడతాయి.

# కోట్ల అభిమానుల నియోజకవర్గ.. ప్రజల కోటి ఆశలు ఆవిరేనా..?

- మాజీ ముఖ్యమంత్రి తనయుడు దేశ రాష్ట్ర వ్యాప్తంగా పేరుగాంచిన కోట్లకు సముచిత స్థానం దక్కలేదా
- మనీ ముందర మచ్చలేని నాయకుడు సైతం తలవంచక తప్పలేదా



**బేతంచెర్ల ,జూన్ 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వైసీపీకి గెలుపు ఖాయమన్న నియోజకవర్గంలో ఆర్థిక మంత్రి బుగ్గనను ఢీకొట్టి నలభై రోజుల్లో విజయఢంకా మోగించిన మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయ్‌భాస్కర్‌రెడ్డి కుమారుడు, దేశ, రాష్ట్ర వ్యాప్తంగా పేరుగాంచిన కోట్ల కుటుంబానికి నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో సముచిత స్థానం దక్కలేదా కోట్ల అభిమానుల నియోజకవర్గ ప్రజల కోటి ఆశలు ఆవిరైనట్లేనా అని మంత్రివర్గ కూర్పు పై రాజకీయ వర్గాల్లో చర్చ ఊపందుకుంది. ఎన్డీయే కూటమి రాష్ట్రంలో అఖండ విజయం సాధించే ముందు అనేక రకాలుగా వ్యూహాలు పన్నుతూ గత ప్రభుత్వంలో బలమైన వ్యక్తులైన మంత్రులను ఢీకొనేందుకు పావులు కదపడంలో డోన్ నియోజకవర్గం ఒకటి. ఇందుకుగాను పలు రకాల వ్యూహాలు పన్నినా ఎన్డీయే కూటమి ప్రధాన నాయకుడు నారా చంద్రబాబు నాయుడు ప్రస్తుత డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డిని పలుమార్లు నచ్చజెప్పి బరిలోకి దింపడం జరిగింది. దీంతో కోట్ల కుటుంబంతోపాటు వారి అభిమానులు, నియోజకవర్గ ప్రజలు నలభై రోజుల్లోనే నారా చంద్రబాబు నాయుడు కోరిన విధంగా మాజీ ఆర్థిక మంత్రి బుగ్గనను ఓడించి జయసూర్యప్రకాష్‌రెడ్డికి విజయం కట్టబెట్టారు. దీంతో రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రిగా పనిచేసిన స్వర్గీయ కోట్ల విజయ్‌భాస్కర్‌రెడ్డి తనయుడు, మాజీ కేంద్ర సహాయ మంత్రి మచ్చలేని నాయకుడు అని పేరుగాంచిన జయసూర్యప్రకాష్‌రెడ్డికి ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రితోపాటు మంత్రి పదవి ఖాయమని కోట్ల అభిమానులు, నియోజకవర్గ ప్రజలు కోటి ఆశలు పెట్టుకున్నారు. అలాగే రాజకీయ విశ్లేషకులు సైతం ఆ కుటుంబానికి ఉన్న పేరు ప్రతిష్ఠలను బట్టి మంత్రివర్గంలో ఖచ్చితంగా వారికి పదవి లభిస్తుందని ఘంటాపదంగా చెప్పారు. అయితే 12వ తేది ఏర్పడిన ఎన్డీయే కూటమి నూతన రాష్ట్ర ప్రభుత్వంలో కోట్లకు స్థానం దక్కకపోవడం పై పలు విమర్శలు, అభిమానుల ఆగ్రహం వ్యక్తమవుతుంది. మనీ ముందర మచ్చలేని నాయకుడు సైతం తలవంచకప తప్పదన్నది నిర్ధారణ అయిందని పలువురు భావిస్తున్నారు. కేవలం మనీ లేకపోవడం వల్లే మంత్రిపదవి దక్కలేదా అన్న చర్చ ఊపందుకుంది. ఏది ఏమైనా కోట్లకు మంత్రి పదవి దక్కకపోవడం పట్ల ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆగ్రహావేశాలతోపాటు విమర్శలు వెల్లువెత్తాయి.

# వైద్యసేవలో మంచితనం.. గుణంలో మానవత్వం...!

- : చెంచు గిరిజనులకు ఉచిత వైద్యసేవలు అందించడమే ఆశయం
- : వేదంత్ వైద్య క్లినిక్‌లో మెరుగైన వైద్యసేవలు
- : ఆర్థిక స్థోమత లేని నిరుపేద కుటుంబాలకు అండగా
- : ప్రభుత్వం అండగా ఉంటే స్వచ్ఛందంగా ఉచిత వైద్యశిభిరాలు

**వైద్య రంగం పేరుతో పేదవారి జోబులు ఖాళీ చేస్తున్న ఈరోజులో వైద్య సేవలో నిరుపేద కుటుంబాలకు అన్ని విదాలుగా సహాయ సహకరాలు అందించి ప్రాణాలు పోతున్న వారికి అన్ని విదాలుగా ప్రాణం పోసి వైద్య రంగంలోనే మంచితనం సంపాదించుకోని నేడు ఆత్మకూరు పట్టణంలో వేదంత్ వైద్య క్లినిక్‌ను ఏర్పాటు చేసి ఆత్మకూరు ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ఆశయంగా నిలచిన శివ ఆర్య జీవితంపై ప్రత్యేక కథనం..**





**ఆత్మకూరు జూన్12,ప్రభాతవార్త:** ఒక సాదారణమైన కుటుంబంలో జన్మించి విద్యా రంగంతో పాటు మెడికల్ రంగంలో అన్ని విదాలుగా ముందుకు వెళ్లి నేడు ప్రజా సేవ చేస్తూ ప్రజల ఆరోగ్య జాగ్రత్తలపై ప్రత్యేక దృష్టి సారించే విదంగా నిరుపేద కుటుంబాలకు...

2లో

# మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన బీసీ జనార్ధన్‌రెడ్డి



**బనగానపల్లెరూరల్ ,జూన్ 12, ప్రభాతవార్త:** ఇటీవల వెలువడిన సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అత్యధిక మెజార్టీతో విజయఢంకా మోగించిన విషయం విధితమే. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్‌లో నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడంతో నూతన ప్రభుత్వం ఏర్పాటైంది. ఇందులో భాగంగానే చంద్రబాబు నాయుడు కేబినేట్‌లో 24 మందికి మ ంత్రులుగా స్థానం కల్పించారు. వీరిలో 17 మందికి మంత్రులుగా మొదటిసారి అవకాశం కల్పించారు. ఇందులో బనగానపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యేగా 25,566 ఓట్ల మెజార్టీతో గెలుపొందిన బీసీ జనార్ధన్‌రెడ్డికి మంత్రివర్గంలో చోటు కల్పించారు. ఈ మేరకు బీసీ జనార్ధన్‌రెడ్డి మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. దీంతో బనగానపల్లె నియోజకవర్గంతోపాటు పట్టణంలోని టీడీపీ కార్యాలయ ఆవరణంలో, పెట్రోల్ బంకు కూడలి నందు, అవుకు మెట్ట, జీఎం టాకీస్‌లతోపాటు పలుచోట్ల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున బాణసంచా కాల్చి కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. బీసీ జనార్ధన్‌రెడ్డికి మంత్రి పదవి దక్కడంతో అభివృద్ధిలో బనగానపల్లె నియోజకవర్గం రూపురేఖలు మారడంతోపాటు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తారని నియోజకవర్గ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## బనగానపల్లెలో.. అంబరన్నంటిన సంబరాలు







## ఉప్పు నమునాల సేకరణ



**చాగలమర్రి ,జూన్ 12, ప్రభాతవార్త:** మండలంలోని అన్ని గ్రామాల పరిధిలో ఉన్న కిరాణషాపుల్లో విక్రయిస్తున్న ఉప్పు నమునాలను సేకరిస్తున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ ఇమ్రాన్ తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రజలు పలు రకాల కల్తీ ఉప్పు తిని అనారోగ్యాలబారిన పడుతున్నారని ప్రజలు తినే ఉప్పులో అయోడిన్ కలిగిన ఉప్పును వాడాలని తెలిపారు. అన్ని దుకాణాల్లో అయోడిన్ కలిగిన ఉప్పునే విక్రయించాలని ప్రతి గ్రామంలో ఉన్న దుకాణాలను పరిశీలించి అక్కడ అమ్ముతున్న ఉప్పు నమునాలను సేకరిస్తున్నమన్నారు. సేకరించిన ఉప్పు నమునాలను ల్యాబ్‌లకు పంపిస్తే ఎంత శాతం అయోడిన్ ఉన్నది పరిశీలించి నివేదికలను తమకు అందజేస్తారన్నారు. నాసిరకం ఉప్పు వల్ల కీళ్లు, కండరాలు, ప్రోటీన్స్ కోల్పోవడం జరుగుతుందన్నారు. కల్తీ రకాల ఉప్పు తినడం వల్ల అనేకమైన వ్యాధులు సంభవిస్తున్నాయని అందుకు అయోడిన్ కలిగిన ఉప్పునే వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఆదోనిలో పునీత ఆంతోని విగ్రహానికి ప్రత్యేక పూజలు

– ప్రారంభమైన పునీత ఆంతోనీ జన్మదిన వేడుకల కార్యక్రమాలు

**ఆదోనిలీగల్, జూన్12, ప్రభాతవార్త;** ఆదోనిలో వెలిసిన పునీత ఆంతోని వారి విగ్రహం ముందు అనేక మంది భక్తుల చేత గురువారం పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతున్నాయి. ఆదోని పట్టణంలోని రైలే వ్వేస్టేషన్ రోడ్డులో ఉన్న సెయింట్ ఆంతోనీ వారి బోర్డింగ్ ప్రాంగణంలో కొలువైన పునీత ఆంతోనీకి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కావునా డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి కూడా అధిక సంఖ్యలో వచ్చి పునీత ఆంతోనీ వారి జన్మదిన వేడుకల్లో పాల్గొంటున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు వేడుక మహోత్సవాలు ప్రారంభమవుతాయి. 10;45కు దివ్యబలి పూజ, అనంతరం హాజరైన భక్తులకు భోజన సదుపాయాలు కల్పించారు. అనాథ ఆశ్రమ బోటింగ్ డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ జాన్ డేవిడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం అంతా కొనసాగుతుందని భక్తులు పేర్కొన్నారు.

## స్టార్‌సొసైటీ నేతృత్వంలో ఘనంగా ప్రపంచ బాలకకార్మిక వ్యతిరేకదినోత్సవం




**నంద్యాల, జూన్ 12,ప్రభాతవార్తప్రతినిది :** నంద్యాల పట్టణంలో స్టార్ సొసైటీ నేతృత్వంలో ప్రపంచ బాలకార్మికుల వ్యతిరేఖ దినోత్సవము ఘన ంగా నిర్వహించారు. ఈ సందర్భముగాస్థానిక నందమూరి నగరులో ఉన్న స్టార్ సొసైటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎపి ట్రైబల ఫెడరేషన్ కార్యదర్శి, మరియు ఎపని బాలలహక్కుల పరిరక్షణ కమీషన్ మాజీ సభ్యులు అయిన ఎరుకలి రాజేశ్వరమ్మ మాట్లాడుతూ 6సంవత్సరాలనుండి 14 సంవత్పరాల పిల్లలు ప్రమాదకరమైన పనుల్లో యాజమానులు పెట్టుకుంటే నేరమని అన్నారు. అదే విదముగా తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించాలని ప్రభుత్వపాఠశాలకు రెగ్యులరుగా పంపించి మంచి ప్రయోజకులగా తయారు చేసుకోవాలన్నారు. తల్లిదండ్రలు పిల్లల పట్ట శ్రర్ధ వహించాలని బారతదేశ భవిషత్తుకు పునాదులు వేసే విదముగా బాలలను చదివించాలని అమె కోరారు. బాలకార్మికులుగ మార్చకూడదని అలా మార్చిన యెడల వారిపైన చట్టపరమైన ఇంటి శిక్షలు ఉన్నాయని చెప్పారు. ఈకార్యక్రమంలో సొసైటి కార్యదర్శి గడ్డంసుబ్బరాయుడుసిబ్బంది యంఐరాజు, సంపత్‌కుమారు, నాగలక్ష్మి, లక్ష్మిదేవి, సౌజన్య తదితరులు హాజరు అయ్యారు.

## చంద్రబాబు ప్రమాణస్వీకారం సందర్భంగా ప్రత్యేక పూజలు



**నందికొట్కూరుటౌన్, జూన్ 12, ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు విజయవాడ సమీపంలోని కేసరపల్లి ఐటీ పార్క్ వద్ద ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా నందికొట్కూరు పట్టణంలోని కోట అంజనేయస్వామి దేవాలయంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు మురళీధర్‌రెడ్డి, నాగేశ్వరరావు, గుణశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లుఅచారిల అధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు దేవాలయం వద్దకు చేరుకుని పూజలు చేసిన అనంతరం దేవాలయం బయట మొక్కు చెల్లించారు. ఈ సందర్భంగా మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ తెదేపా విజయంతో రాష్ట్ర ప్రజానీకానికి, ముఖ్యంగా రైతన్నలకు మంచి రోజులు వచ్చాయన్నారు. చంద్రబాబు ప్రమాణస్వీకారం రోజున రాష్ట్రవ్యాప్తంగా వరుణదేవుడు కరుణించడంతో చల్లటి వాతావరణం నెలకొందన్నారు. ప్రమాణస్వీకారం రోజున వర్షం పడడం శుభసూచకమన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇచ్చిన మాట నిలుపుకున్న సిఎం



**కోవెలకుంట్ల, జూన్ 12, ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల కంటే ముందు ఎన్నికల ప్రచారంలో కూడ చెప్పిన మాటను నిలుపుకొని బీసీ జనార్ధనరెడ్డికి మంత్రివర్గంలో చోటు కల్పించారని మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గడ్డం నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం రాష్ట్ర మంత్రిగా బనగానపల్లె ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం ప్రమాణస్వీకార కార్యక్రమానికి వెళ్లిన కోవెలకుంట్ల మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గడ్డం నాగేశ్వర్‌రెడ్డి బీసీకి పుష్పగుచ్చం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బివి సుబ్బారెడ్డి తరువాత బీసీ జనార్ధనరెడ్డికి అరుదైన అవకాశం దక్కిందన్నారు. 1978 నుండి నేటి వరకు కోవెలకుంట్ల, బనగానపల్లె ప్రాంతాలకు మంత్రివర్గంలో చోటులేదని ఆయన చెప్పారు. అయితే బీసీ జనార్ధన్‌రెడ్డి రెండవమారు భారీ విజయం సాధించడంతో ఆయనకు బివి సుబ్బారెడ్డి తరువాత మంత్రివర్గంలో చోటు లభించడం నియోజకవర్గ ఓటర్లు చేసుకున్న పుణ్యమని ఆయన చెప్పారు.

## చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారంతో టిడిపి శ్రేణుల సంబరాలు



**బండిఆత్మకూరు, జూన్ 12, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రిగా పవన్ కల్యాణ్ బుధవారం ప్రమాణస్వీకారం చేయడంతో మండల వ్యాప్తంగా టిడిపి నాయకులు, జనసేన నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. మండలంలోని సంతజూటూరు గ్రామంలో చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేయడంతో టిడిపి నాయకులు, అభిమానులు బారీ కేక్ కట్‌చేసి పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి, నృత్యాలు చేస్తు సందడి చేస్తు మిఠాయిలు పంచుకుంటూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. మండలంలోని ఎంపీడిఓ కార్యాలయం నందు చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం ప్రత్యక్ష ప్రసారం వీక్షించడానికి కార్యాలయం నందు స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో లాయర్ కృష్ణారెడ్డి, నాగేంద్రారెడ్డి, పలసాని మహేశ్వర్‌రెడ్డి, యలగల తిరుపాలు, బాబురెడ్డి, తుమ్మల వేణు, అలిశం జగదీశ్వర్‌గౌడ్, యలగల మోహన్, మురళీ, పాల నాగిరెడ్డి, ఉమ్మడి సుమన్, రసూల్, ఎ పెద్దన్న, పిక్కిలి వెంకరమణ, ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ విజయుడు, మౌలిషు తదితరులు పాల్గొన్నారు.

## ఒంటెద్దు ఒండి రాతి దూలం పోటీలు ప్రారంభం



**చాగలమర్రి ,జూన్ 12, ప్రభాతవార్త:** స్థానిక చాగలమర్రి పట్టణ శివార్లలో వెలసిన శ్రీశ్రీశ్రీ కట్టమీది దస్తగిరిస్వామి ఉరుసు మహోత్సవం సందర్భంగా ఒంటెద్దు బండి రాతిదూలం పోటీలను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షులు ఎం.ఎస్.అన్సర్‌బాషా, దాత నాల్గవ ఎంపిటి ఇన్‌చార్జ్ జెట్టి నాగరాజు, కమిటీ సభ్యులు అలంసాగారి మౌలాలిలు పోటీలు ప్రారంభించారు. అనంతరం కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ పోటీల్లో 22 ఒంటెద్దు బండ్లు పాల్గొంటున్నయన్నారు. మొదటి బహుమతి రూ.10వేలు నాల్గవ ఎంపిటిసి ఇన్‌చార్జ్ జెట్టి నాగరాజు, రెండవ బహుమతి రూ.8వేలు చిన్న రాముదు యాదవ్, మూడవ బహుమతి రూ.6వేలు ఉసేన్‌వలి, నాల్గవ బహుమతి రూ.4వేలు మహబూబ్‌బాషా(బారిక్‌ఛామల్), ఐదవ బహుమతి రూ.3వేలు జమాల్ బాషా, ఆరు, ఏడు బహుమతులు రూ.2,500, రూ.2000, రూ.1000లు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యాన పంటలపై అవగాహన కల్పించండి

**కొత్తపల్లి, జూన్12, ప్రభాతవార్త :** మండలంలోని ఆయా గ్రామాలలోని రైతులకు ఉద్యాన వన పంటలపై అవగాహన కల్పించి సాగుచేసుకొనేల ప్రోత్సహించాలని ఏపీఓ రేష్మ సూచించారు. బుధవారం స్థానిక ఉపాధిహామి కార్యాలయం నందు ఉపాధిహామి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలోని ఫీల్డ్ అసిస్టెంట్ లు వారి గ్రామాల పరిధిలో రైతులకు ఉద్యానవన పంటల సాగువల్ల కలిగే లాభాలను తెలిపి సాగుచేసుకోనేలా ప్రోత్సహించాలని సూచించారు. గ్రామాలలో ఫీల్డ్ అసిస్టెంట్ లు ప్రజా ప్రతినిధుల సమన్వయంతో, రైతుల సమన్వయంతో సనిచేయాలన్నారు. ఉద్యాన వన పంటసాగుతో రైతులు అర్ధిక స్థితిగతులు మారుతాయని తెలిపారు. ఇప్పటివరకు 154 ఎకరాలను గుర్తించామన్నారు. ఇంకా ధరఖాస్తు చేసుకునే రైతులు ఉంటే ధరఖాస్తు చేసుకొనేల చూడాలన్నారు. కార్యక్రమంలో ఉపాధిహామి సిబ్బంది పాల్గొన్నారు.

## అత్యంత వైభవంగా ఉరుసు మహోత్సవం



**చాగలమర్రి ,జూన్ 12, ప్రభాతవార్త:** స్థానిక చాగలమర్రి పట్టణానికి సమీపంలో వెలసిన శ్రీశ్రీశ్రీ దస్తగిరిస్వామి ఉరుసు మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. బుధవారం స్థానిక పాతబస్టాండ్‌లో ఉన్న దర్గా కమిటీ సభ్యులు అలంసాగారి మౌలాలి ఇంటి నుండి దస్తగిరిస్వామికి గంధం తీసుకుని మేళాతాళాలతో, మంగళవాయిదా ్యలతో, పక్కీరల విన్యాసాలతో దర్గా వద్దకు వెళ్లారు. ఉరుసు సందర ్భంగా శెట్టివీడు గ్రామ ప్రజల సహకారంతో అక్కడికి వచ్చిన భక్తులందరికి రెండు రోజులపాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రా ష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షులు ఎం.ఎస్.అన స్ర్‌బాషా, నాల్గవ ఎంపిటిసి ఇన్‌చార్జ్ జెట్టి నాగరాజు, టీడీపీ నాయకులు కొలిమి షరీఫ్, అనిఫ్, టైలర్ ఖాదర్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీఓ కార్యాలయంలో చంద్రబాబు ప్రమాణస్వీకార కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం- హాజరైన ప్రజలు



**గడివేముల, జూన్12, ప్రభాతవార్త;** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని ప్రజలు వీక్షించేలా ప్రత్యక్ష ప్రసారాన్ని ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా మండలకేంద్రమైన గడివేములలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల అధికారులు బుధవారంనాడు ప్రత్యేక ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. దాదాపు 150 మందికి పైగా ప్రజలు బుధవారంనాడు ఉదయం 10 గంటలకే హాజరై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఇతర మంత్రుల ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శివరామ్‌రెడ్డి, ఈఓపీఆర్‌డీ కాలిక్‌బాషా, గ్రామప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## బహుమతులు అందజేత



**చాగలమర్రి ,జూన్ 12, ప్రభాతవార్త:** స్థానిక చాగలమర్రి పట్టణ శివార్లలో వెలసిన శ్రీశ్రీశ్రీ కట్టమీది దస్తగిరిస్వామి ఉరుసు మహోత్సవం సందర్భంగా బుధవారం నిర్వహించిన ఒంటెద్దు బండి రాతిదూలం పోటీల్లో గెలుపొందిన వృషభాలకు తెలుగుదేశం పార్టీ రా ష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షులు ఎం.ఎస్.అన్సర్‌బాషా, తెలుగుదేశం పార్టీ నాల్గవ ఎంపిటిసి ఇన్‌చార్జ్ జెట్టి నాగరాజులు రూ.10వేలు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యుడు మౌలాలి మాట్లాడుతూ గెలుపొందిన వృషభాలకు రెండవ బహుమతి రూ.8వేలు, మిగతా అన్ని బహుతులను అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టైలర్ ఖాదర్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అవుకు పట్టణంలో టిడిపి నాయకుల సంబరాలు

–మంత్రివర్గంలో బీసీ జనార్ధన్‌రెడ్డికి చోటు దక్కడంపై హర్షం



**అవుకు, జూన్ 12, ప్రభాతవార్త:** సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డియే కూటమి ఘనవిజయం సాధించిన విషయం తెలిసిందే ఈసందర్భంగా బుధవారం టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు, బనగానపల్లె బీసీ జనార్ధన్‌రెడ్డికి మంత్రివర్గంలో దక్కడంపై అవుకు మండలంలోని టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా పట్టణంలో కేక్ కట్ చేసి బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేయడం మంత్రిగా బీసి జనార్ధన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయడంతో ఆంధ్రప్రదేశ్‌కు మంచిరోజులు వచ్చాయని సంక్షేమ పథకాలు అందించేందుకు టిడిపి ప్రభుత్వం ముందుంటుందని సంపద సృష్టించి సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని వారు తెలిపారు. బనగానపల్లె నియోజకవర్గానికి అసలైన అభివృద్ధి చేసి చూపిస్తారని వారన్నారు. ఈకార్య క్రమంలో టిడిపి నాయకులు ఉగ్రసేనారెడ్డి, ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షులు రమణ నాయక్, టిడిపి కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## చింతాలయపల్లె హత్యకేసులో ముద్దాయిలు అరెస్టు

**కొలిమిగుండ్ల, జూన్ 12, ప్రభాతవార్త:** కొలిమిగుండ్ల మండల పరిధిలోని చింతలాయపల్లె గ్రామంలో గత 6వ తేదిన జరిగిన నాగేంద్ర హత్య కేసులో ముద్దాయిలు మంజుల రామాంజి, మంజుల పెద్ద పుల్లయ్య, మంజుల మనోహర్‌లను బందార్లపల్లె చెక్‌పోస్టు వద్ద కొలిమిగుండ్ల సిఐ గోపినాథ్‌రెడ్డి అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచి ముద్దాయిలను రిమాండ్‌కు పంపినట్లు సిఐ గోపినాథ్‌రెడ్డి తెలిపారు.

## హెల్పింగ్‌హ్యాండ్స్ ఆధ్వర్యంలో బ్యాంక్ ఉద్యోగి సేవాకార్యక్రమాలు



**వెల్దుర్తి, జూన్12, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన వెల్దుర్తిలో హెల్పింగ్‌హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో నివాసం ఉంటున్న బ్యాంక్ ఉద్యోగి పలు సేవాకార్యక్రమాలు చేశారు. కోడుమూరు నియోజకవర్గంలోని లద్దగిరి యూనియన్ బ్యాంక్‌లో విధులు నిర్వహిస్తున్న రాజశేఖర్, రాజేశ్వరి దంపతులు తమ వివాహ వేడుకల సందర్భంగా పట్టణంలోని వడ్డె వీధిలో వృద్ద మహిళలకు పట్టణ సమీపంలోని భువనగాయత్రి దేవాలయం అర్చకులు బాలక్రిష్ణఆచారికి నగదుతో పాటు నిత్యావసర వస్తువులను అందించారు. బ్రహ్మగుండం క్షేత్రంలో వానరులకు పండ్లు అందించారు. స్వయంభూ హనుమాన్ దేవాలయంలో నిర్వహించే నిత్యాన్నదానానికి తమ వంతు ఆర్థికసహాయంను, నిర్వా హాకురాలు మాధవమ్మకు నిత్యావసరవస్తువులను అందించారు. నారాయణరెడ్డినగర్‌లోని నిరుపేదలకు వారు ఆహారం, పండ్లు అందించారు. రెడ్‌క్రాస్‌సొసైటీలో కుట్టుశిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న వారిని సైతం పలకరించి వారి మిషన్ల మరమ్మత్తులకు, బిసిబాలికల వసతి గృహానికి వారు వెళ్లి అక్కడ హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఏర్పాటుచేసిన గ్రంథాలయ పుస్తకాల కప్‌బోర్డును పరిశీలించి విధ్యార్థినీలకు ఉపయోగ పడే పుస్తకాలకై కొంత నగదును అందించారు. ఆ దంపతులను రెడ్‌క్రాస్‌సొసైటీలోని మహిళలు శాలువ, పూలమాలలతో సన్మానించారు. వీరు చేపట్టిన సేవాకార్యక్రమాలు పలువురికి స్ఫూర్తిదాయకమై కష్టాలు పడుతున్న వారిని ఆదుకుంటారని ఆశిద్దాం. ఆ కుటుంబాన్ని ఆయా ఆలయాల అర్చకులు, వృద్దులు, నిరుపేద కుటుంబాలు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్‌హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షులు వి.యం.హారిసింహానాయుడు, సత్యసాయి హైస్కూల్ హెచ్‌ఎం గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

## చదువుకు.. వేళాయెరా..!

**(మొదటి పేజీ తరువాయి ) :** పంపిణీచేసేందుకు విద్యాశాఖాధికారులు అన్ని ఏర్పాట్లు చేసారు..జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల విభాగంలో ప్రైమరీ 30, అప్పర్ ప్రైమరీ 03, హైస్కూల్స్ 14, ఎంపీపీ జెడ్‌పి పరిధిలోప్రైమరీ 844, అప్పర్ ప్రైమరీ 167, హైస్కూల్స్ 209, ఇక మునిసిపాలిటి పరిధిలో ప్రైమరీ 78, అప్పర్ ప్రైమరీ 08,హైస్కూల్స్ 17, ఏపీమోడల్ స్కూల్స్ 16, కస్తూరీబా గాంధీ బాలికల విద్యాలయాలు అంటే కేజీబివి 26, రెసిడెన్షియల్ 21, ఎయిడెడ్ పరిధిలో ప్రైమరీ 20, అప్పర్ ప్రైమరీ 3, హైస్కూల్స్ 14 పాఠశాలలు ఉన్నాయి..జిల్లాలో దాదాపు అన్నీ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉన్నట్లు తెలుస్తోంది.. ముఖ్యంగా ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత శాపంగా మారిందని చెప్పవచ్చు..సబ్జెక్టు టీచర్లు లేకపోవడంతో ఎవరో ఒకరు సదరు సబ్జెక్టును బోధించి మమ అనిపిస్తున్న దుస్థితి నెలకొంది..విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయుల నియమాకాలను చేపట్టాల్సినతక్షణ కర్తవ్యం కొత్త ప్రభుత్వంపై ఉంది.. ఎని ్నకల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారంచేసిన వెంటనే డిఎస్సీపై తొలి సంతకం పెడుతానని చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ నెరవేరితే చాలా పాఠశాలల్లోఉపాధ్యాయుల కొరత తీరి ఊరట కలుగుతుందని చెప్పవచ్చు.. మరి ఏమి జరుగుతుందో వేచి చూడాల్సిందే..

## "మంత్రి టీజీ భరత్" అభిమానుల సందడి..!

**(మొదటి పేజీ తరువాయి ) :** ఉపాధి అవకాశాలు కల్పించారు. అంతేగాక వారి సొంత ఆస్పత్రిలో పేదలకు మెరుగైన వైద్యం అందిస్తూ ప్రజాభిమానం సొంతం చేసుకున్నారు. ప్రజల విషయం లోనే కాక పాలన విషయంలోనే అధికార వైసీపీ తప్పులను ఎప్పటికప్పుడు ఎత్తిచూపుతూ తమ పార్టీ కార్యకర్తలతో కలిసి ప్రభుత్వాన్ని నిలదీస్తూ వచ్చారు. దీంతో భరత్ మాటల మనిషే కాదు. చేతల మనిషి అని ప్రజలలో నమ్మకం కుదిరింది. మాట ఇస్తే నిలబెట్టుకుంటాడనే భావన ఏర్పడింది. అలాంటి భరత్‌కు మంత్రి పదవి రావడం పట్ల సర్వత్రా ఆనందం నెలకొంది.

## వైద్యసేవలో మంచితనం.. గుణంలో మానవత్వం...!

**(మొదటి పేజీ తరువాయి ) :** అన్ని విదాలుగా ముందుండి వైద్యానికి నోచుకోని పేద కుటుంబాలకు అన్ని వేళలలో వైద్యం అందించేందుకు నేను ఉనాన్నంటు ధైర్యాని కల్పిస్తూ వైద ్య సేవలో మంచి తనం... గుణంలో మానవత్వం... చాటుకుంటూ నేటి యువతరానికి ఆదర్శంగా నిలచిన శివ ఆర్య జీవితంపై ఎన్నో మలుపులు తిరిగి నేడు నల్లమల అటవీ ప్రాంతంలో నివాసం ఉంటున్న చెంచు గిరిజనులకు ఉచిత వైద్య సేవను అందిస్తూ ప్రభుత్వ సహకారం ఉంటే గిరిజన గూడెలలో ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి గిరిజన కుటుంబాలకు అండగా ఉండాలనదే శివ ఆర్య జీవిత ఆశయంగా ఉందని చెప్పవచ్చు. 2023 సంవత్సరంలో పట్టణంలోని శ్రీరామ్‌నగర్ ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్ వెనుక బాగంలో ప్రవేట్ క్లినిక్‌ను ఏర్పాటు చేసి నేడు డివిజన్‌లోని గ్రామీణ ప్రాంతాలలో ఓ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ఆర్థిక స్థోమత లేని నిరుపేద కుటుంబాని ఉచిత వైద్యంను అందిస్తూ మరో మారు తాను చేస్తున్న సోషల్ సర్వీసులో భాగంగా నేడు ఆత్మకూరు ప్రాంతంలో నిరుపేద ప్రజల నుంచి ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. వేదాంత్ క్లినిక్ పేరుతో ప్రతి ఒక్కరికి వైద్యసేవలు అందించడమే శివ ఆర్య ఆశయమని పలువురు పేర్కొంటున్నారు.

## నల్లకాల్వ గ్రామంలో మలేరియా మాసోత్సవం - డాక్టర్ పవన్‌కుమార్

**ఆత్మకూరు జూన్12,ప్రభాతవార్త:** వర్షాకాలంలో దోమల నివారణపై వైద్యశాఖ ఆధ్వర్యంలో ముందస్తు చర్యలు చేపట్టడం జరిగిందని బైర్లూటి ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి పవన్‌కుమార్ పేర్కొన్నారు. బుదవారం మండల పరిధిలోని నల్లకాల్వ గ్రామంలో మురికి నీటిపై వేస్టుఆయిల్, బ్లీచింగ్ పౌడర్, డ్రైనేజి కాల్వల్లో దాగి ఉన్న దోమాలను నివారించేందుకు పిచికారి చేయించడం జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారి పవన్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు వర్షాకాలంలో తప్పని సరిగ్గా ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని వివరించారు. వేడి పదార్థాలను ఆహరంగా తీసుకోవాలని తెలియజేశారు. మలేరియా మాసోత్సవం కార్యక్రమంలో బాగంగా వర్షపునీరు ఆగి ఉన్న లోతట్టు ప్రాంతాలలో అబేట్ ద్రవాని పిచికారి చేసి దోమకాటుకు గురి కాకుండా నివారణ చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రజలు ముఖ్యంగా దోమకాటుకు గురికాకుండా దోమతెరలు పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత శుభ్రత పాటించడం



వలన మలేరియా వ్యాదిని నివారించే విదంగా ప్రజలు తప్పని సరిగ్గా ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని వివరించారు. వీరి వెంటా పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, మహిళాపోలీసు, హెల్త్ ఆసిస్టేంట్ బాస్కర్, శారద, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# నేడే పాఠశాలలు ప్రారంభం

## -పాఠశాల ఆర్వోప్లాంట్...
## పరిసరాలు పరిశుభ్ర చేసుకోవాలి




నంద్యాల విద్య, జూన్ 12, ప్రభాతవార్త:

ఈఏడాది 2024-25 విద్యాసంవత్సరానికి నేడు పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్నాయి. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠశాలలు ప్రారంభించే రోజు అన్ని నియమ నిబంధనలు పాటించాలని రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక ఆదేశాలు జారీచేశారు. ఈమేరకు పాఠశాలలు ప్రారంభించే నాటికి తరగతి గదులు, పరిసరాలు శుభ్రంగా ఉండేవిధంగా చుసుకోవాలి. నాడే నేడు నిమిత్తం తీసిన గుంతలు, నిల్వ ఉంచిన సామాగ్రి, కరెంటు వైర్లు ప్రమాదకరంగా లేనివిధంగా తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. తాగునీటికి సంబంధించి ఆర్వో ప్లాంట్‌ను మరుగుదొడ్లను ఆయాల చేత క్లినింగ్ చేయించి అవరణ చుట్టు పెరిగినటువంటి పిచ్చిమొక్కలు తొలగించాలి. రీ ఓపెనింగ్ నుంచి ఫెషియల్ అటెండెన్స్ తప్పనిసరిగా వేయాలి. ఐఎఫ్‌పి ప్యానల్స్‌ను పనిచేసే విధంగా సిద్ధం చేసుకోవాలి. మధ్యాహ్నభోజన పథకం మెనును ప్రదర్శించాలి. మధ్యాహ్నభోజన వంట వండే ఏజెన్సీలకు గతంలో నిర్వహించిన శిక్షణ మేరక వారికి విడియోలను చూపించాలి. భోజనం వండే టప్పుడు పాత్రలు శుభ్రంగా ఉండాయో లేదో చూసుకుని వంట వండించాలి. స్టూడెంట్ కిట్లను విద్యార్థులకు సకాలంలో అందించాలి. నాడు నేడు కింద వచ్చిన నిధుల విషయంలో బ్యాలెన్స్ నిధులు రికార్డు పరంగా నమోదుచేసుకోవాలి. జూలై నెలకు సంబంధించిన బియ్యం, గుడ్లు, చిక్కీలు, శుభ్రంగా ఉంచుకోవాలి. మధ్యాహ్నం భోజనం సంబంధించిన బియ్యంను డీలర్ వద్దకు వెళ్లి తెచ్చుకోవాలి. విద్యార్థులకు సంబంధిచిన కిట్‌లు బెల్టు, టై, సాక్షులు, మూడు జతల బట్టలు విద్యార్థులకు అందజేయాలి. విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక చర్చలు నిర్వహించి పాఠశాల ప్రగతికి తోడ్పడేవిధంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషిచేయాల్సిన అవసరం ఉందని ఈ నిబంధనలు అన్ని పాటించి పాఠశాల పురోభివృద్ధికి విద్యార్థుల సంక్షేమానికి పాటుపడాలని ఆదేశించారు.

## వాల్మీకులకు మంత్రి పదవులను కేటాయించాలి

- 150 యేళ్ల చరిత్ర కలిగిన ఆదోని నియోజకవర్గంలో ఒక్క మంత్రి కూడా లేరు
- బీసీ ఫెడరేషన్ నాయకుల ఆవేదన



**ఆదోనిలీగల్, జూన్12, ప్రభాతవార్త:** 2024 శాసనసభ ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించిన వాల్మీకులకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరినాయుడు, పట్టణ సలహాదారులు అడ్వకేట్ అలిగేర రామాంజనేయులు కోరారు. ఈ మేరకు బుధవారం వారు స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాయలసీమలో సత్తా చాటిన వాల్మీకి సామాజికవర్గం నుంచి గెలుపొందిన ముగ్గురు ఎమ్మెల్యేలకు మంత్రివర్గంలో నిరాశే ఎదురయ్యిందన్నారు. మా వాల్మీకి సామాజికవర్గంలో సీనియర్స్ అయిన కాల్వ శ్రీనివాసులు, గుమ్మనూరు జయరాం, నూతనంగా ఎన్నికైన పార్థసారథిలు ఉన్నారన్నారు. ఈ ముగ్గురు అభ్యర్థులు అత్యధిక మెజార్టీతో గెలుపొందారని, మా సామాజికవర్గానికి ఒక మంత్రి పదవి కూడా కేటాయించకపోవడం శోచనీయమన్నారు. కావునా రెండో లిస్టులో నైనా మా సామాజిక వర్గానికి మంత్రివర్గంలో చోటు కల్పిస్తారని ఆశిస్తున్నామన్నారు. ఆదోని నియోజకవర్గంలో 150 సంవత్సరాల చరిత్ర కలిగిన మున్సిపాలిటీలో కూడా ఇంతవరకు ఒక మంత్రి పదవి కూడా ఎన్ని ప్రభుత్వాలు మారినా కేటాయించకపోవడం దుర్మార్గమైన చర్య అని వాపోయారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెంటనే స్పందించి న్యాయం చేస్తారని విజ్ఞప్తి చేశారు.

## కొలిమిగుండ్లలో తెలుగు తమ్ముళ్ళ సంబరాలు



**కొలిమిగుండ్ల, జూన్ 12, ప్రభాతవార్త:** బనగానపల్లె ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డికి రాష్ట్ర క్యాబినెట్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చోటు కల్పించడంతో కొలిమిగుండ్ల మండలంలో తెలుగు తమ్ముళ్లు సంబరాలు మునిగిపోయారు. మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డికి మంత్రి పదవి వచ్చిన సందర్భంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు డప్పు వాయిద్యాలతో టపాసులు పేల్చుతూ పార్టీ కార్యాలయంలో కేక్ కట్‌చేసి తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు. ఈకార్యక్రమంలో మండల టిడిపి ప్రచార కార్యదర్శి శివరామిరెడ్డి, అందే రాము, బొట్టు స్వామి, గూలి నాగేశ్వర్‌రెడ్డి, టీవీ రాముడు, కరెంటు మధు, నిమ్మకాయల దస్తగిరి, శివ, ఎరుకలి చిన్నమల్లయ్య, పిక్కిలి రామకృష్ణుడు, పుల్లయ్య తదితర నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు సరఫరాకు శ్రీకారం - ఎంఈఓ సుభాన్



**పగిడ్యాల, జూన్ 12,ప్రభాతవార్త :** 2024-25 విద్యాసంవత్సరం పాఠశాలలు గురువారం ప్రారంభము కావడంతో " విద్యాకానుక " పథకం ద్వారా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు ఆయా పాఠశాలలకు సరఫరా చేసేందుకు మండల కేంద్రమైన పగిడ్యాలలో వాహనం ద్వారా బుధవారం జెండా ఊపి పంపిణీకి విద్యాశాఖాధికారులు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భగా మండల విద్యాధికారి పి.సుభాన్, మండల విద్యాధికారి - 2, మురళీమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ 1వతరగతి నుండి 10వతరగతి చదువుతున్న విద్యార్థులకు సంబంధించి 20వేల పాఠ్యపుస్తకాలు, 23వేల నోట్‌పుస్తకాలు వచ్చాయన్నారు. బెల్టులు, బూట్లు యూనిఫారం, బ్యాగులు రావలసివుందనీ రాగానే పంపిణీ చేస్తామన్నారు. మండలంలో జెడ్పీపాఠశాలలు -4, ప్రాథమిక పాఠశాలలు 20, ప్రాథమికోన్నత పాఠశాలలు -2, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల బాలికపాఠశాల -1, మోడల్‌స్కూల్ -1, కస్తూర్బాపాఠశాల -1, మొత్తం 29 పాఠశాలలు ఉన్నాయన్నారు. రెండు రోజుల్లో పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు " విద్యాకానుక " కు సంబంధించి విద్యార్థులకు అందజేయవలసిన వాటిని అందజేస్తామనీ మండల విద్యాశాఖాధికారి పి.సుభాన్, మండల విద్యాశాఖాధికారి -2, మురళీమోహన్‌రెడ్డి తెలిపారు.

## గడిగరేవుల గ్రామంలో టీడీపీ శ్రేణుల సంబరాలు

- టీడీపీ గెలుపుతో గ్రామంలో ప్రతి ఇంట పండగ వాతావరణం నెలకొంది
- గడిగరేవుల గ్రామ టీడీపీ నాయకుడు కంది శ్రీనివాసులు



**గడివేముల, జూన్12, ప్రభాతవార్త:** 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ భారీ విజయాన్ని అందుకొని, పాణ్యం నియోజకవర్గంలో ఎమ్మెల్యే గౌరు చరితమ్మ ఉమ్మడి జిల్లాలో అత్యధిక మెజార్టీతో గెలిచిందని గడిగరేవుల గ్రామ టీడీపీ నాయకుడు కంది శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం సందర్భంగా గడిగరేవుల గ్రామంలో టీడీపీ పార్టీ టీడీపీ అధ్యక్షులు కంది శ్రీనివాసులు ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రతి ఇంటింటికి కోళ్లను పంచి సంబరాలు చేసుకున్నారు. గ్రామంలోని ప్రతి గడప, ప్రతి ఇంటికి ఈరోజు ఒక పండుగలాగా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డే జమ్మూలు, పూల శ్రీనివాసులు, చాకలి నాగరాజు, తలారి రవి, మిద్దె రామగోపాల్, జీఎన్ఆర్, కిట్టు, కంది సుధాకర్, కంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## కుమార స్వామివారికి విశేష అభిషేకం



**శ్రీశైలంప్రాజెక్టు, జూన్12, ప్రభాతవార్త :** శ్రీగిరిక్షేత్రంలో లోక కల్యాణం కొసం షష్టిని పురస్కరించుకుని దేవస్థానం బుదువారం నాడు ఉదయం ఆలయప్రాంగణంలోని శ్రీసుబ్రహ్మణ్యస్వామి (కుమారస్వామి)వారికి విశేషపూజలను నిర్వహించడం జరిగింది.ప్రతి మంగళవారం మరియు కృత్తికానక్షత్రం, షష్టి తిథి రోజులలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి ఈ విశేష అభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానంసేవగా(సర్కారిసేవగా) నిర్వహించబడింది.కాగా కుమారస్వామివారికి పూజలు జరపడం వలన లోక కలా్యణమే కాకుండా ప్రతి ఒక్కరికి ఉధ్యోగ, వ్యాపార, వ్యవహారాలలో అటుపోట్లు తొలగిపోయి ఆయా పనులు సక్రమంగా జరుగుతాయి.ఈ అబిషేకానికి ముందుగా దేశం శాంతిసౌబాగ్యలతో విలసిల్లాలని, ప్రకృతివైపరిత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, జనులకు ఆయారారోగ్యాలు, అన్ని సామాజిక వర్గాలు ప్రజలు సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు.తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహగణపతిపూజ జరిపి అనంతరం శ్రీసుబ్రహ్మణ్యస్వామివారికి అభిషేకం, సుబ్రహ్మణ్యఅష్టోత్తరము చేసిన అనంతరం సుబ్రహ్మణ్యస్తోత్రము పారాయణలు చేసారు.అదే విధంగా స్వామివారికి అభిషేకంతో పంచామృతాలతోనూ, వివిధ పళ్ల రసాలతోచేసే అభిషేకంతో ఎంతో ఫలితం ఉంటుందని ఆగమాలు చెబుతున్నాయి.

## శ్రీసాక్షిగణపతిస్వామికి విశేష అభిషేకం



**శ్రీశైలంప్రాజెక్టు, జూన్12, ప్రభాతవార్త :** లోక కల్యాణం కొసం దేవస్థానం బుదువారంనాడు ఉదయం సాక్షిగణపతిస్వామివారికి సంకటహరతి చవితిరోజులు మరియు పౌర్ణమి రోజులలో ఈ విశేష అభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానంసేవగా(సర్కారిసేవగా) నిర్వహించబడుతున్నాయి.కాగా సా క్షిగణపతిస్వామివారికి పంచామృతాలతోనూ, ఫలుఫలోదాకాలతోనూ, హరిద్రోదకం, శుద్దజలంతో అభిషేకం నిర్వహించబడింది.తరువాత స్వామివారికి విశేషపుష్పర్చన, నివేదన కార్యక్రమాలు జరిపించబడ్డాయి.కాగా వైదిక సంప్రదాయాలలో గణపతి అభిషేకానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది.అదే విధంగా శ్రీశైలక్షేత్ర పరివార ఆలయాలలో సాక్షిగణపతి ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది.కాగా చక్కని నల్లరాతితో మలచబడిన ఈ స్వామి ఒకచేతిలో కలం, మరోచేతిలో పుస్తకాన్ని ధరించి భక్తుల పేర్లను నమోదు చేస్తునట్లుగా దర్శనమిస్తాడు.

## కాశీపురం ప్రభాకర్‌రెడ్డికి కుప్పం రెడ్డమ్మ అవార్డు



**నందా్యల, జూన్ 12, ప్రభాతవార్తప్రతినిధి:** నంద్యాలకు చెందిన సీనియర్ జర్నలిస్టు, రచయిత కాశీపురం ప్రభాకర్‌రెడ్డికి కుప్పం రెడ్డమ్మ సా్మరక రాష్ట్రస్థాయి అవార్డు దక్కింది. ప్రభాకర్‌రెడ్డి రాసిన "మేడం సి" అనే నవలకు గాను ఈ అవార్డు ఇచ్చారు. బుధవారం చిత్తూరులో చిత్తూరు జిల్లా రచయితల సంఘం అధ్వర్యంలో జరిగిన ఒక కార్యక్రమంలో రెడ్డమ్మ ట్రస్ట్ అధ్యక్షురాలు డా. కె రామలక్ష్మీ ఈ అవార్డు అందించారు. క్రికెట్ నేపధ్యంలో వచ్చిన ఈ నవలలో రాయలసీమ సాంస్కృతి గొప్పతనాన్ని అద్భుతంగా వివరించారని వక్తలు పేర్కొన్నారు. రచయిత ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కేవలం ఏడాది కాలంలో మూడు ముద్రణలకు నోచుకొని పాఠకులను విశేషంగా అలరిస్తుందన్నారు. నంద్యాల జిల్లాలోని కుకూ ఎఫ్‌ఎంలో ప్రసారం అవుతున్న మొట్టమొదటి నవల మేడం..సి కేవలం 40 రోజుల్లో దాదాపు 10 వేల మంది శ్రోతలు వినడం ద్వారా రికార్డు సృష్టించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో చిత్తూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు కట్టమంచి బాలకృష్ణారెడ్డి, ప్రముఖ రచయితలు ముని సురేష్ పిళ్లై, ఎంఆర్ అరుణకుమారి, రోహిణి వంజారి, డా.సుగుణారావు, నంద్యాల జిల్లా జర్నలిస్టుల సంఘం (ఏపీయుడబ్ల్యుజే) గౌరవాధ్యక్షులు ఎం జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సైనిక పాఠశాల్లో చేరండి...
## రక్షణశాఖలో ఉద్యోగాలు పొందండి




**నంద్యాల విద్య, జూన్ 12, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖ పరిధిలో నడిచే సైనిక స్కూల్స్‌లో 2024-25 విద్యాసంవత్సరానికి అడ్మిషన్లకు ధరఖాస్తులు కోరుతూ అయా ప్రిన్సిపాళ్లు నోటిఫికేషన్ జారీచేశారు. సైనిక స్కూళ్ళల్లో 6, 9 తరగతులకు ప్రవేశ పరీక్ష ద్వారా ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సైనిక స్కూల్స్‌లో సిబిఎస్ఈ సిలబస్ బోధన ఉంటుంది. ఇవన్ని ఇంగ్లీషు మీడియం రెసిడెన్షి పాఠశాలలు కావడం విశేషం. ఇక్కడ చదివిన విద్యార్థులకు నేషనల్ డిఫెన్స్ అకాడమి, ఇండియన్ నావి అకాడమిలకు ఇక్కడ ఉన్న విద్యార్థులను సిద్ధం చేస్తుంటారు. అర్హులైన బాల బాలికలు ధరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 33 సైనిక స్కూలస్‌లో ఈప్రవేశాలు కల్పిస్తారు. ఈ ప్రవేశ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ సంస్థ నిర్వహించనుంది. 6వ తరగతి ధరఖాస్తు చేసుకునే విద్యార్థుల వయసు 10 నుంచి 12 సంవత్సరాల మధ్య ఉండాలి. 6వ తరగతిలో ప్రభుత్వ సీట్లు 2970, ప్రైవేట్ సీట్లు 2255 ఉన్నాయి. 9వ తరగతికి 697 సీట్లు కేటాయించారు. ఏపీలో విజయనగరం జిల్లా కోరుకొండలో, చిత్తూరు జిల్లా కలికిరిలో, నెల్లూరు జిల్లా కృష్ణపట్నంలో సైనిక పాఠశాలలున్నాయి. 9వ తరగతిలో చేరే విదా్యర్థులు 13 నుంచి 15 సంవత్సరాలు ఉండాలి. రక్షణరంగంలో పనిచేస్తున్న వారి పిల్లలు ఓబిసి, ఎక్స్‌సర్వీసు మెన్ పిల్లలు కూడ ధరఖాస్తు చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ ఫీజు కింద రూ.650లు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.500ల చొప్పున ఫీజు చెల్లించాలి. దేశవ్యాప్తంగా 186 పరీక్ష కేంద్రాల్లో ఈపరీక్షను నిర్వహిస్తారు. అర్హులైన అభ్యర్థులు జూలైలో ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## జ్వాలవీరభద్రస్వామివారికి విశేష పూజలు



**శ్రీశైలంప్రాజెక్టు, జూన్12, ప్రభాతవార్త :** లోకకలా్యణం కోసం దేవస్థానం బుదువారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని వీరభద్రస్వామివారికి( జ్వాలవీరభద్రస్వామివారికి)విశేష పూజలు నిర్వహించడం జరిగింది. ఆలయప్రాంగణంలోని మల్లికార్జుస్వామివారికి ఆలయానికి ఉత్తం భాగంలో మల్లికాగుండానికి ప్రక్కనే ఉన్న వీరభద్రస్వామి జ్వాలామ కుటంతో పదిచేతులతో విశిష్టరూపంలో దర్శనమిస్తాడు.శిల్పాశాస్త్ర పరిబాషలో ఈ స్వామికి అఘోరవీరభ్‌ద్రమూర్తి అని పేరు కూడా ఉంది.కాగా ప్రతి బుదువారం ప్రదోషకాలంలో విశేష అబిషేకం కార్యక్రమం దేవస్థానం నిర్వహిస్తోంది.కాగా ఈ పూజలలో ముందుగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహగణపతిపూజను నిర్వహించబడింది.తరువాత వీరభద్రస్వామికి పంచామృతాలతోనూ, ఫలు రకాల ఫలోదాకాలతోనూ మరియు మల్లికా గుండంలోని శుద్దజలంతోనూ విశేష అభిషేకం నిర్వహించడం జరిగింది.ఈ అభిషేకాల తరువాత విశేషంగా స్వామివారికి పుష్పార్చనను జరిపించబడింది.

## బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు స్పెషల్ డ్రైవ్



**నంద్యాల, జూన్ 12, ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచ బాలకార్మిక దినోత్సవాన్ని పురష్కరించుకొని జిల్లా ఇంచార్జీ అధికారి, సహాయ కమిషనరు బషిరున్నిసా బేగం అధ్యక్షతన స్థానిక మున్సిపల్ కార్యాలయం నుండి సంజీవనగర్ వరకు విద్యార్థులు వివిధ శాఖాల అధికారులు అలెస్కో రఘురామిరెడ్డి, మండల లీగల్ సర్వీసు కమిటీ వారు, ఎన్‌జిఓలు రామారావు, తిరుపతిరావు, సుబ్బరాయుడులు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా కార్మికశాఖ సహాయ కమిషనరు బషిరున్నిసా బేగం మాట్లాడుతూ వివిధ సంస్థల యాజమాన్యం వారు 18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని చట్టం ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈనెల చివరి వరకు జిల్లా వ్యాప్తంగా బాలకార్మిక నిర్మూలనకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

## కామ్రెడ్ రాధక్క మృతికి ఘన నివాళీలు




**నందికొట్కూరు, జూన్ 12, ప్రభాతవార్త:** గోదావరి లోయ ప్రతిఘటనా పోరాట యోధురాలు కామ్రెడ్ చంద్రపుల్లారెడ్డి జీవిత సహచరి కామ్రెడ్ రాధక్క(86) అలియాస్ అక్కినేని నిర్మల మృతి సిపిఐ (యం.యల్)న్యూడెమోక్రసీ పార్టీ బుధవారం నందికొట్కూరు పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళీలు అర్పించారు.ఈ సంధర్బంగా జిల్లా కార్యదర్శి వై.నరసింహ్ములు మాట్లాడుతు రాధక్క కొంత కాలంగా ఆనారోగ్యానికి గురై కోలుకోలేక హైదరాబాదులో తన కుమార్తె ఇంట మంగళవారం రాత్రి మృతి చెందినట్లుగా ఆయన తెలిపారు. దశాబ్దాలుగా పైగా ఆమె క్రియాశీలకంగా పోరాటాలు సాగించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారానికి తరలివెళ్లిన టిడిపి నాయకులు




**కర్నూలు హాస్పిటల్, జూన్ 12, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బుధవారం కృష్ణ జిల్లా గన్నవరం కేసరిపల్లి ఐటి పార్కు వద్ద చేపట్టిన ప్రమాణస్వీకారానికి కర్నూలు జిల్లా నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కర్నూలు ఎమ్మెల్యే టీజీ భరత్‌కు మంత్రివర్గంలో స్థానం దక్కడం ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, జిల్లా నుండి ఎన్నికైన శాసన సభ్యులు కెఇ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, బివి జయనాగేశ్వర్‌రెడ్డి, నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్జీలు కె మీనాక్షినాయుడు, ఎన్ రాఘవేంద్రారెడ్డి, బీ వీరభద్రగౌడ్, కోడుమూరు నియోజకవర్గ మాజీ ఇంచార్జ్జీ డి విష్ణువర్ధన్‌రెడ్డిలు హాజరయ్యారు.

## మల్లెల పుల్లారెడ్డి అధ్వర్యంలో టిడిపి సంబరాలు



**కర్నూలు హాస్పిటల్, జూన్ 12, ప్రభాతవార్త:** మోడీ, నారా చంద్రబాబు నాయుడు, పవన్ నాయత్వంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతుందని మాజీ సింగిల్ విండో చైర్మన్ మల్లెల పుల్లారెడ్డి పేర్కొన్నారు. బుధవారం బళ్లారి రోడ్డు వై జంక్షన్ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం సందర్భంగా పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి, మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు మేనిఫెస్టోలో చెప్పిన 6 గ్యారెంటీ పథకాలు తప్పకుండా అమలు చేస్తారని, ప్రజలందరికి సేవ చేయడానికే నారా చంద్రబాబు నాయుడు వచ్చారన్నారు. ఈకార్యక్రమంలో సాహిల్ బాషా, డా.మురళీకృష్ణ, రఘు ఆచారి, శ్రీనివాసులు, రాజు, మహబూబ్ బాషా, హరి తదితరులు పాల్గొన్నారు.

## బాలకార్మీకుల నిర్మూలన భాధ్యత తల్లిదండ్రులదే



**నందికొట్కూరు, జూన్ 12, ప్రభాతవార్త:** బాలకార్మీల నిర్మూలన భాధ్యత తల్లిదండ్రులదేనని తమ పిల్లలను బాగా చదివించుకోవాలని నందికొట్కూరు సీనియర్ సివిల్ జడ్జి ఎం.ఇందిరాప్రియదర్శిని, జూనియర్ సివిల్ జడ్జి వి.దివ్య తెలిపారు. బుధవారం బాలకార్మీకుల నిర్మూలన దినోత్సవం సంధర్భంగా కోర్టు ఆవరణంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర వ్హహించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతు 14 ఏళ్ళలోపు చిన్నారులను పనులలో పెట్టుకోకూడదని నిభంధనలకు విరుద్దంగ ఎవరైన పిల్లలను పనిలో పెట్టుకుంటే శిక్షార్హులు అవుతారని, బాలకార్మీకుల నిర్మూలన భాధ్యత తల్లిదండ్రుల, అధికారులపై ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వాయు, నీటి, ధ్వని కాలుష్యాలను నిర్మూలించాలని దీనిపై పోల్యూషన్ అధికారులు ప్రజలలో అవగాహన కలిగించాలని వారు సూచించారు. అలాగే ఈ నెల 29న జరిగే లోకాదలత్‌లో రాజీమార్గాన అయ్యే కేసులను పరిష్కారించుకోవచ్చునని వారు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు జె.వెంకటరాముడు, న్యాయవాదులు టి.రఘునాథ్‌రెడ్డి, రహంతుల్లాబేగ్, వేంకటేశ్వర్లు, కేశాలు, సోషెల్ వర్కర్ రిటైర్డ్ ఉపాధ్యాయురాలు, లేబర్ ఆఫీసర్ పాల్గొన్నారు.

## టిడిపి వేద విజ్ఞానపిఠాల్లోవివిధ కోర్సుల్లో ప్రవేశాలు

**నంద్యాల విద్య, జూన్ 12, ప్రభాతవార్త:** తిరుమల తిరుపతి దేవస్థానం పరిధిలోని శ్రీవెంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విశ్వవిద్యాలయం అధికారులు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. బుగ్వేదం, శుక్లయుజుర్వేదం, కృష్ణయజుర్వేదం, సామవేదం, అధర్వనవేదం, దివ్యప్రబంధనం, వైఖానసాగమం, పాంచరాత్ర అగమం, చాత్తాద శ్రీవైష్ణవ అగమం, వైశాగమం, శైవాగమం, అపస్తంబ పౌరోహిత్యం తదితర కోర్సులకు ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. వయసు జూలై 1 2012 నుంచి జూన్ 30 2014 మధ్య జన్మించి ఉండాలి. తిరుమల తిరుపతి వెబ్‌సైట్‌లో చూపించిన ధరఖాస్తు నమూనాను పూర్తిచేసి ప్రిన్సిపాల్ ఎస్వీ వేద విజ్ఞానపీఠం ధర్మపురి చిరునామాలకు పంపాలని సూచించడమైంది.

## భక్తులపై కాల్పులు జరిపిన పాకిస్తాన్ ఉగ్రమూకలను

# బహిరంగంగా "ఉరి"తీయాలి...




**కర్నూలు విద్య, జూన్ 12, ప్రభాతవార్త:** జమ్ముకాశ్మీర్‌లోని వైష్ణోదేవి (కట్రా) నుంచి శివ్‌ఖోడికి వెళ్తున్న హిందూ భక్తుల బస్సుపై పాకిస్తాన్ పెంచి పోషించిన ఇస్లామిక్ జిహాది ఉగ్రవాదులు చేసిన పిరికిదాడిలో 10 మంది అమాయక హిందూ యాత్రికులు మరణించారు. ఈఘోరమైన సంఘటనతో యావత్ భారతదేశం తీవ్ర దిగ్భ్రాంతికి లోనయింది. జమ్ముకాశ్మీర్ చాలకాలంగా పాకిస్తాన్ పోషించిన ఉగ్రవాదానిన ఎదుర్కొంటుంది. ఆర్టికల్ 370ని తొలగించిన తరువాత అక్కడ ప్రశాంతవాతావరణానికి ఒక ఆశాజ్యోతి వచ్చింది. కానీ ఉగ్రవాదుల మనోబలం ఇంకా తగ్గలేదని హిందూవులను లక్ష్యంగా చేసుకొని చంపెసంఘటనలు పెరిగాయని తెలుస్తోంది. వీటన్నింటిని వెనుక పాకిస్తాన్ హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా బజరంగ్ దళ్ కనీ ్వనర్ మీనుగ రాజేష్ మాట్లాడుతూ విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ మరణించిన హిందూ యాత్రికులకు నివాళ్లు అర్పిస్తు ఈదారుణమైన చర ్యపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిందన్నారు. ఇటువంటి కార్యకలాపాలను పూర్తిగా నియ ంత్రించడానికి నిర్ణయాత్మక మరియు కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని అదేశించాలని జిల్లా కలెక్టరు ద్వారా భారత రాష్ట్రపతిని అభ్యర్థిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ కర్నూలు జిల్లా కార్యదర్శి మాళిగి భానుప్రకాష్ సహకార్యదర్శులు గూడూరు గిరిబాబు, ఈపూరి నాగరాజు, బజరంగ్ దళ్ సాప్తాహిక్ మిలన్ కనీ ్వనర్ సాయిరాం, రాము, రామకృష్ణ, నగర కనీ ్వనర్ తెలుగు భగిరథ, హరి, గుజరాతి సురేష్, నాగరాజు, భాస్కర్, చామిరాజు సాయినాథ్, సుశాంత్, మోహిత్, యశ్వంత్, నాగేంద్ర, కుల్దిప్ నారాయణ, అవినాష్,రవీంధ్రగౌడ్, అయోధ్య శేషాచలపతి, బాబురావు, శివకోటి చంద్రశేఖర్, ఉపేంద్రనాయక్, కోరుకుంట్ల సంజీవయ్య, కరణం సుధాకర్ కార్తీక్, జయప్రకాష్‌సింగ్, నవీన్, సాయి ప్రణిత్, నితిన్‌రెడ్డి జశ్వంత్‌రెడ్డి, అఖీల్, లక్కీ, భార్గవ్, కృష్ణసింగ్, అనిల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నాల్లో వేచిన ఉదయం ఈ నాడువికసించిన వేళ



**నంద్యాల, జూన్ 12,ప్రభాతవార్తప్రతినిధి :** అంధ్రప్రదేశలో మంత్రి వర్గ చరిత్రలో బిసి పేరు చిరస్థాయిగా నిలుస్తోంది.నాటి బివిసుబ్బారెడ్డి తరువాత కోవెలకుంట్ల, బనగానపల్లె నుండి రెండవ మంత్రిగా ప్రమాణము చేసిన ఘనత ఒక్క బిసికే దక్కింది అందుకే ఎన్నాల్లో వేచిన ఉదయం ఈనాడే వికస్తుంటే అక్కడ ప్రజలకేరింతలు చూడముచ్చగా ఉన్నాయి కోవెలకుంట్ల అసెంబ్లీ నియోజక వర్గం ఉన్న సమయంలో బివి సుబ్బారెడ్డి మంత్రిగా, ఉపముఖ్యమంత్రిగా స్పీఖరుగా పని చేశారు నాడు నేటి బనగానపల్లె కోవెలకుంట్లలో ఉండేది.1976.1978 అ ప్రాంతములో నాటి బివి సుబ్బారెడ్డి ఇక్కడి నుండి మంత్రి పదవి చేపట్టారు. అనంతరముకోవెలకుంట్ల, పాణ్యం అటు తర్వాత బనగానపల్లె ఏర్పడిన కూడా మంత్రి పదవి ఎవరినీ వరించలేదు. అందేకే ఎన్నాల్లో వేచిన చూసిన మంత్రి పదవి ఇక్కడి ప్రజల కళ కళలను బిసి నేరవేర్చారు.అందుకే అయన పేరు రాష్ట్రం చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తోంది, బనగానపల్లె 2009 కంటే ముందు పాణ్యంలో కొనసాగేది.అక్కడిని చాలా ఎందరో ప్రాతినిథ్యము వహించారు కాని ఎవరు మంత్రి పదవి చేపట్టాలేదు. అది వారికి అందనంత దూరంలో ఉండేది కాని మూడవ సారి పోటీ చేసి బారీ విజయము ఏకంగా 25566 ఓట్లు సాదించిన బిసిని వరించింది. మొదటి సారిగా 2014లో విజయం సాదించారు. అటు తర్వాత 2019లో ఓటమి చెందారు అయితే ఓటమిని ఒకచాలెంజీగా తీసుకుని నిత్యము ప్రజల మద్యనే ఉంటు నాటి అదికార పార్టి ఒత్తిడిలను ఎదుర్కొటు కార్యకర్తలను కాపాడుకున్నారు. ఇక్కడే కాకుండా అదిష్టానము అదేశాల మేరకు ప్రకాశం, నెల్లూరు ఉమ్మడి జిల్లాలో పార్టిని బ్రతికించారు. అయన శ్రమపలితమే అక్కడున్న నాయకులంతా ఒకేతాటిపైకి వచ్చి నేడు విజయ పదములో పయనించారు. అందుకే అదిష్టానము బిసికి సముచి స్థానము ఇచ్చి నంద్యాల జిల్లాలో ఎసి జాబితాలో బిసికి అవకాశము కల్పించారు.అలాగే రాష్ట్రంలో కూడా రెడ్ల కోటాలో ముగ్గ ్గరికి మంత్రి పదవులు కేటాయించగా మొదటి వరుసలో బిసి నిలిచారు. ఈయన సొంత గ్రామం బనగానపల్లె మండలంలోని యనకండ్ల ఈయన తండ్రి గుర్రెడ్డి కాలం నుండి బనగానపల్లె స్థిరపడ్డారు. అయన గు ర్రెడ్డికి రెండవి కుమారుడు వీరు ముగు ్గరు అన్నదమ్ములు అన్న బాలతిమ్మారెడ్డి స్వర్గస్తులుగా తమ్ముడు రాజారెడ్డి గతంలోనే బనగానపల్లె సర్పంచుగ పని చేసి ప్రజల మన్ననలు పొందారు ఇక చివరి తమ్ముడు రామనాదరెడ్డి బిసికి చేదోడువాదోడుగా ఉంటున్నారు. బిసికి ఇద్దరుకుమార్తెలు, ఒక కుమారుడు ఈమన సతీమణి ఇందిరమ్మ భర్త ప్రజసేవలో అమె అడుగు వేస్తు వెన్నుతట్టి ముందుకు నడిపిస్తున్న సతీమణి, ఈయనకు కుటుంబము కంటే కార్యకర్తలే ప్రాణము అందుకే బనగానపల్లె చరిత్రను తిరగ వ్రాశారు.

# బీసీ రాజారెడ్డికి అభినందనల వెల్లువ



**బనగానపల్లెరూరల్ ,జూన్ 12, ప్రభాతవార్త:** ఇటీవలే వెలువడిన సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో బనగానపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యే ్యగా బీసీ జనార్ధన్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. ఈ మేరకు జరిగిన ముఖ్యమంత్రి, మంత్రుల ప్రమాణస్వీకారోత్స వంలో భాగంగా బనగానపల్లె ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి చంద్రబాబు నాయుడు కేబినెట్‌లో మంత్రిగా బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. దీంతో బీసీ జనార్ధన్‌రెడ్డి సోదరుడు, బనగానపల్లె గ్రామ పంచాయతీ మాజీ సర ్పంచ్ బీసీ రాజారెడ్డిని పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి మర్యాదపూర్వకంగా కలిసి శాలువలతో, పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తల కష్టపడి పనిచేయడంతోపాటు ప్రజలు బీసీ కుటుంబం పై ఉన్న నమ్మకంతో బీసీ జనార్ధన్‌రెడ్డిని ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించారని ఇందుకు ప్రతిఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే బనగానపల్లె నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సుబ్బరాయుడు, శంకరయ్య తదితరులు ఉన్నారు.

## బాపణంతాపురం గ్రామంలో సిఎం ప్రమాణస్వీకార వేడుకలు

; గ్రామ సర్పంచ్ దరగయ్య, యువ నాయకులు మహేష్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమం

: రాష్ట్ర అభివృద్ధి టిడిపి ప్రభుత్వంతోనే సాధ్యం

: నియోజకవర్గంలో అన్ని సామాజిక వర్గాల ప్రజలకు సమ్వనయం బుడ్డాతోనే అభివృద్ధి



**ఆత్మకూరు జూన్12,ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బుదవారం జరిగిన ప్రమాణ స్వీకార వేడుకల సందర్భంగా మండల పరిధిలోని బాపణంతాపురం గ్రామంలో గ్రామ సర్పంచ్ గ్రందివేముల దరగయ్య, శ్రీశైలం నియోజకవర్గం ఐటిడిపి ఉపాధ్యాక్షులు గ్రందివేముల మహేష్‌ల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి యువత, గ్రామ ప్రజలతో కలసి సంబరాలను నిర్వహించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వంతోనే అన్ని సామాజిక వర్గాల ప్రజలకు సమన్వయం చేస్తూ రాష్ట్ర అభివృద్ధి టిడిపి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని తెలిపారు. ముఖ్యంగా శ్రీశైలం నియోజకవర్గంలో ఎంఎల్‌ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి చొరవతో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు గత టిడిపి ప్రభుత్వంలో అభివృద్ధి చేసిన చరిత్ర ఉందని గుర్తు చేశారు. నేడు మళ్లీ శ్రీశైలం నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో ఎంఎల్‌ఏగా గెలచి నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విదాలుగా అభివృద్ధి బాటలు వేయడం బుడ్డా రాజశేఖరరెడ్డితోనే సాధ్యమవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత మండల ఉపాధ్యాక్షులు మనోహార్, గ్రామ టిడిపి యువ నాయకులు లింగస్వామి, అనితారావు, రమణ, చరణ్‌తేజ, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబునాయుడు
# చిత్రపటానికి పాలాభిషేకం

### - కేక్ కటింగ్,మిఠాయిలు పంపిణీ..



**వెల్దుర్తి,జూన్12,ప్రభాతవార్త :** ఏపి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారంను పురస్కరించుకొని మండలంలోని గుంటుపల్లి గ్రామంలో రైతుసంఘం తెదేపా నాయకులు ఈదుల వెంకటరాముడు ఆధ్వర్యంలో బుధవారం పాలాభిషేకం కార్యక్రమాన్ని నాయకులు,కార్యకర్తలతో కలిసి నిర్వహించారు.స్వర్గీయ ఎన్టీఆర్,ఏపి సిఎం చంద్రబాబునాయుడు,మాజీ డిప్యూటీ సిఎం కెఇ క్రిష్ణమూర్తి,పత్తికొండ ఎమ్మెల్యే కెఇ శ్యాంబాబు చిత్రపటాలకు ఆయన పాలాభిషకం చేసి,కేక్ కటింగ్ చేశారు.అందరికి మిఠాయిలు పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు శేషిరెడ్డి,పెద్దవెంకటేశ్వర్లు,నారాయణ,వెంకటేశ్వర్లు,శ్రీనివాసులు,రాముడు,శివనారాయణ,రంగస్వామి,రావ ుడు,సత్యం,రామాంజనేయులు,రాజశేఖర్,బోయయల్లయ్య,మోహన్,మురళి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ దేవాలయాల అభివృద్ధికి కృషి చేయాలి - బ్రహ్మానందాచారి



**బనగానపల్లె ,జూన్ 12, ప్రభాతవార్త:** బనగానపల్లె మండలం పలుకూరు గ్రామంలో స్థానిక ఎనకండ్ల ఆంజనేయస్వామి దేవస్థానం నందు పూజారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో భక్తిభావన మరియు కె.కృష్ణమూర్తి కుమారుడు కె.మోహన్‌రావు ఆంజనేయస్వామికి రూ.15వేలు విలువైన వెండి మాల విరాళంగా బుధవారం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జె.ఎస్.ఎస్.బ్రహ్మానందాచారి మాట్లాడుతూ తిరుపతి, శ్రీశైలం, కాశీలో మీరు విరాళాలు ఇస్తే ఎటువంటి పుణ్యం వస్తుందో గ్రామీణ ప్రాంత దేవాలయాలకు కూడా విరాళాలు ఇస్తే అంతే పుణ్యం వస్తుందన్నారు. ప్రతిఒక్కరు భక్తి భావన అలవర్చుకోవాలని తమ విలువైన సమయంలో ఒక గంట అయినా భగవంతుడిని కోసం కేటాయించాలని బ్రహ్మానందాచారి కోరారు. అనంతరం కె.మోహన్‌రావుకు భక్తిపూర్వక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూజారి శ్రీనివాసులు, కె.ఇ.వెంకటసుబ్బయ్య గౌడ్, మహేష్, ఆంజనేయస్వామి భక్తబృందం తదితరులు పాల్గొన్నారు.

## కోడుమూరులో ఆర్యవైశుల సంబరాలు



**కోడుమూరు,జూన్ 12, ప్రభాతవార్త :** నేడు జరిగిన కూటమి ప్రభుత్వ ఏర్పాటులో జరిగిన మంత్రి వర్గ విస్తరణలో కర్నూలు టీడీపీ ఎమ్మెల్యే టీజీ భరత్‌కు చోటు దక్కడంతో కోడుమూరులో ఆర్యవైశ్యుల కుటుంబా లు సంబరాలు చేసుకున్నారు. స్థానిక కోట్ల సర్కిల్ దగ్గర టీడీపీ శ్రేణులు, ఆర్యవైశ్యుల సంఘం నాయకులు లింగం బ్రదర్స్ లింగం బాలక్రిష్ణయ్య, లింగం చిన్న లక్ష్మయ్య తదతరులు బాణ సంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారంతా టీజీ నాయకత్వం వర్ధిల్లాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

## ఘనంగా చంద్రబాబు ప్రమాణస్వీకార సంబరాలు



**చాగలమర్రి ,జూన్ 12, ప్రభాతవార్త:** స్థానిక పట్టణంలోని చక్రపాణి సినిమా థియేటర్ నందు చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారోత్స వ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సినిమాహాల్‌లో ప్రమాణస్వీకార లైవ్ షో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు నంద్యాల జిల్లా బీసీసెల్ స్పోక్‌పర్స న్ సల్ల నాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో రాష్ట్ర టీడీపీ మైనార్టీసెల్ ఉపాధ్యక్షులు ఎం.ఎస్.అన్స ర్‌బాషా కేక్‌కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబు నాయుడుకు, మంత్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడి ప్రజా ప్రభుత్వానైనా తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమిని అత్యధిక మెజార్టీతో గెలిపించడం జరిగిందన్నారు. ఈ ప్రభుత్వం కక్ష, కార్పణ్యాల కోసం కాకుండా ప్రజల శ్రేయస్సు, రాష్ట్రాభివృద్ధి కోసం పనిచేస్తుందని తెలిపారు. ఈ కార ్యక్రమంలో వీరంరెడ్డి భాస్కర్‌రెడ్డి, కామిశెట్టి రమేష్, మహబూబ్‌బాషా, కసినేని ఓబులేసు, టైలర్ బాషా, రఫివుద్దీన్, చోటు, నరేంద్ర, అబ్దుల్ ఖాదర్, టింగు ఉసేన్, షరీఫ్, వెంకటయ్య, నాగార్జున, మోహన్, చిన్నికృష్ణ, రంగనాయకులు, జోసఫ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి



**బేతంచెర్ల ,జూన్ 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ఎన్డీయే ప్రభుత్వంలో మంత్రి పదవి దక్కించుకున్న బనగానపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి, బేతంచెర్ల పట్టణ బీసీసెల్ ప్రధాన కార ్యదర్శి లోకేష్ గౌడ్, వీరాంజనేయులు, టీడీపీ నాయకులు విజయవాడలో బుధవారం శుభాకాంక్షలు తెలిపారు. కార్యకర్తలకు అండగా నిలబడిన నాయకుడిని గుర్తించి పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో బీసీకి స్థానం కల్పించడం హర్షణీయమని వారన్నారు.

## మంత్రి టీజీని కలిసిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల నాగేంద్ర



**కర్నూలు హాస్పిటల్, జూన్ 12, ప్రభాతవార్త:** విజయవాడలో బుధవారం జరిగిన మంత్రివర్గ ప్రమాణస్వీకార కార్యక్రమంలో టీజీ భరత్‌కు మంత్రి పదవి లభించడంతో కర్నూలు జిల్లా అభిమానులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. విజయవాడలో ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల నాగేంద్ర టీజీ భరత్‌ను కలిసి తమ ఆనందాన్ని పంచుకున్నారు. కర్నూలుకు మంచి రోజులువచ్చాయని మంచి అభివృద్ధి జరుగుతుందని యువనేతకు మంత్రి పదవి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా జనసేన, బిజెపి మంత్రులకు అందరికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## టీజీకి మంత్రివర్గంలో స్థానం కల్పించడం అభివృద్ధికి శుభసూచకం



**కర్నూలు విద్య, జూన్ 12, ప్రభాతవార్త:** కర్నూలు నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీతో గెలుపొందిన టీజీ భరత్‌కు రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించడం కర్నూలు అభివృద్ధికి శుభసూచకంగా కనిపిస్తోందని ఆంధ్రప్రదేశ్ బ్రహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటరామరాజు అనా ్నరు. బుధవారం గన్నవరం వద్ద కీసరపల్లిలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు. క్యాబినెట్ మం త్రిగా ప్రమాణస్వీకారం చేసిన ఎమ్మెల్యే టీజీ భరత్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈసదర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వున్న బ్రహ్మణ బంధువుల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. ఈకార్యక్రమంలో బ్రహ్మణ సంఘ నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి పరిస్థితి విషమం ఇద్దరికి తీవ్రగాయాలు




**నందికొట్కూరు,జూన్ 12, ప్రభాతవార్త:** పట్టణ సమీపంలోని కర్నూలు రోడ్డులోని భారత్ పెట్రోలు బంక్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు కాగా అందులో ఒకరి పరిస్థితి తీవ్రంగా ఉండడంతో కర్నూలుకు తరలించారు. బుధవారం ఉదయం కర్నూలు నుండి ఫారంకోళ్ళతో వస్తున్న బోలోరో వాహానం టైర్ పేలిపోవడంతో అదుపు తప్పి రాళ్ళలోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో ఈ సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారిని నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రధమ చికిత్స అనంతరం వారిని కరూ ్నలుకు తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లుగా పోలీసులు తెలిపారు.

## గుంతలు తీశారు..వదిలేశారు



**కొత్తపల్లి, జూన్12,ప్రభాతవార్త :** మండలంలోని గోకవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రహారి గోడ నిర్మించేందుకు గత ఏడాది గుంతలు తీసి వదిలేశారు.ఈ పాఠశాలలో మొత్తం 120 మంది విద్యార్థులు చదువుతున్నారు.ఇటీవల వర్షం కురవడంతో గుంతల నిండా నీరు ఆగాయి. ఆ గుంతలో విద్యార్థులు కింద పడి ప్రమాదాల బారిన పడే అవకాశముంది.ఈ సమస్య పై ఎంఈవో శ్రీరాములుని వివరణ అడగగా ప్రహారి ఆకారం మార్చమని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాడంతో పనులు మధ్యలో ఆగిపోయాయని మరల ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులు ప్రారంభిస్తామన్నారు.

## కౌన్సిలరు నుండి మంత్రిదాకా ఎదిగిన యన్‌యండి ఫరూక్



**నంద్యాల, జూన్ 12,ప్రభాతవార్తప్రతినిధి**

రాష్ట్ర మంత్రిగా యన్‌యండి ఫరూక్ మరో మారు ఎపి మంత్రిగా ప్రయాణ స్వీకారం చేశారు. అయన తన రాజకీయ ప్రస్థానములో కౌన్సిలరు ప్రారంబించి మంత్రి దాకా ఎదిగారు. 1981లో నంద్యాల మున్సుపల్ కౌన్సిలరుగా తన రాజకీయ జీవితం అరంభించారు. అనంతరం 1985 తొలిసారి నంద్యాల ఎమ్మెల్‌ఎగా గెలుపొంది అప్పట్లో చెక్కెర పరిశ్రమ మంత్రిగా పని చేశారు 1994లో రెండవ సారి ఎమ్మెల్‌ఎగా ఎన్నికై డిప్యుటి స్పీకరుగా బాధ్యతలు నిర్వహించారు. అనంతరం 1999లో మూడవ సారి ఎమ్మెల్‌ఎగా గెలుపొంది మున్సుపల్ శాఖ మంత్రిగా ఉర్దూ అకాడమి మంత్రిగా పని చేశారు. 2017లో గవర్నరు కోటా ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు 10217-18లో మద్య అరోగ్యశాఖ .మైనార్టి శాఖల మంత్రిగా వ్యవహరించారు. నేడు మరో మారు మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.